

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు

జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు కల్పించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 8లో



సంక్షేమం.. అభివృద్ధిని ఆశీర్వదించండి

సంక్షేమం.. అభివృద్ధిని అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుతానికి అండగా నిలవాలని డిప్యూటీ సీఎం కోరారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సా)	సహర్ బుధవారం(ఉ)
చిత్తూరు	6.30	4.47
పుంగనూరు	6.31	4.51

న్యూస్‌రీల్

'నారా.. నల్లారి' ఓటమి తథ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ యండపల్లె శ్రీనివాసులరెడ్డి

రొంపిచెర్ల: సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఓటమి తథ్యమని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ యండపల్లె శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రొంపిచెర్లలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేసుల మాఫీ కోసం చంద్రబాబు నాయుడు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. పదవుల కోసం కిరణ్‌కుమార్ రెడ్డి బీజేపీలో చేరి పోటీ చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదాను తుంగలో తొక్కి రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీతో ఎలా కలుస్తారని ప్రశ్నించారు. ఇద్దరినీ ప్రజలు ఓటుతో ఇంటికి పంపడం ఖాయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు సక్రమంగా అందించి, వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఇప్పుడు పెన్షన్ అందలేదని వృద్ధులు విలపిస్తున్నారని, వారి ఉసురు చంద్రబాబుకు తప్పకుండా తగులుతుందని తెలిపారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులకు ఇవే చివరి ఎన్నికలని స్పష్టం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి తనను నమ్ముకున్న వారి కోసం ఏమైనా చేస్తారని వెల్లడించారు. పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఎంపీ మిథున్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు గుండ్లూరి రామచంద్రారెడ్డి, డి.వాసుదేవరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం



మూల్యాంకనం చేస్తున్న టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం పదో తరగతి మూల్యాంకనం ప్రారంభమైంది. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. డీఈఓ దేవరాజు మూల్యాంకన ప్రక్రియను పర్యవేక్షించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,78,623 జవాబు పత్రాల్లో మొదటి రోజు 21,594 పేపర్లను మూల్యాంకనం చేసినట్లు అధికారులు వెల్లడించారు. మూల్యాంకనం విధులు కేటాయించిన టీచర్లలో బయాలజికల్ సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి 16 మంది గైర్హాజరయ్యారు. వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు డీఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చాడేశ్వరి పాల్గొన్నారు.

టీడీపీ వేధింపులకే రాజీనామా



రాజీనామా పత్రం చూపుతున్న యువరాజ్

పుత్తూరు: పురపాలక పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వలంటీర్ పి.యువరాజ్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. సోమవారం ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రం అందజేశారు. యువరాజ్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నానని, టీడీపీ నాయకుల కారణంగా మనస్తాపానికి గురైన రాజీనామా చేశానని వెల్లడించారు. ఇప్పుడు స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేస్తూ, జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా మంత్రి రోజమ్మను గెలుపులో తన వంతు పాత్ర పోషిస్తానని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,224 మంది స్వామివారిని దర్శించుకోగా 24,093 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పండుటాకులపై పగా?



ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి ముందు ప్రత్యక్షమయ్యే వలంటీర్ ఈసారి రాలేదు.. వేకువనే ఠంచన్‌గా వచ్చే పింఛన్ ఈసారి రాలేదు.. ఆత్మగౌరవానికి రక్షణగా నిలిచే నగదు చేతికందలేదు.. ఎవరిపై ఆధారపడాల్సిన పనిలేకుండా సగర్వంగా జీవించే భరోసా కలిగించిన సొమ్ము కనుచూపు మేర కనిపించలేదు. ఈ నెల మందులు ఎలా కొనుగోలు చేసుకోవాలి.. కనీస అవసరాలకు ఎవరి కాళ్లావేళ్లా పడాలి.. పండుటాకుల కళ్లలో తీరని ఆవేదన. ఇన్నాళ్లూ కడుపులో చల్ల కదలకుండా కనిపెట్టుకుని చూసుకున్న వలంటీర్ కనపడకపోయేసరికి అవ్వాతాతల మదిలో ఆందోళన. స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు తమ బతుకులను పణంగా పెట్టారని మనసులో ఆగ్రహం. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. బారులు తీరి గంటల తరబడి ఎదురుచూపులు.. మళ్లీ మొదలయ్యాయనే ఆక్రోశం.

సాక్షి నెట్‌వర్క్/చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో ఇంటి వద్దనే నిశ్చింతగా ఉంటూ ఫించన్ పొందుతున్న అవ్వాతాతలు, విభిన్నప్రతిభావంతులు టీడీపీ కుట్రల కారణంగా గడప దాటాల్సిన దుస్థితి వచ్చింది. ప్రభుత్వం ప్రతి నెలా 16 రకాల ఫించన్లు పంపిణీ చేస్తోంది. జిల్లాలో 2,74,540 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. వీరిలో 75 శాతం మంది అవ్వాతాతలు, విభిన్నప్రతిభావంతులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఉన్నారు. అందులో 15 శాతం మంది మంచానికే పరిమితమైనవారు ఉన్నారు. వీరందరూ టీడీపీ దుర్మార్గపు ఫిర్యాదుల కారణంగా ఏప్రిల్, మే, జూన్‌లో గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి ఫించన్ తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపై అవ్వాతాతలు, దివ్యాంగులు తీవ్రంగా మండిపడుతున్నారు. టీడీపీ హయాంలో పడిన ఇబ్బందులను జ్ఞప్తికి తెచ్చుకుని ఆందోళన చెందుతున్నారు.

మార్గదర్శకాలు ఇవీ..

గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీకి ఎన్నికల కమిషన్ అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి వేలిముద్ర వేసి పింఛన్లు పొందాల్సి ఉంది. ఇందుకు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం ఈ మేరకు సెర్ప్ అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. సచివాలయాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించనున్నారు.

మాపై ఎందుకీ కక్ష ?



మా ఇంట్లో నేను, నాభార్య ఉంటాం. మా కష్టార్జితంతో బతుకుతుంటాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని నాకు ప్రతి నెలా రూ. 3వేల పెన్షన్ వస్తుంది. వలంటీర్ ఇంటి కాడికే వచ్చి పింఛన్ డబ్బు ఇస్తాడు. కోడి కూయకే ముందే వచ్చి గేటు తట్టి నగదు అందిస్తాడు. పనిమీద బయటికి వెళ్లినా కూడా పొద్దునే ఫోన్ చేసి పింఛన్ తీసుకోమని బలవంతం చేసి ఇచ్చేసే వాడు. ఆ పింఛన్ డబ్బును ఇంటి ఖర్చులకు వాడుకుంటాం. పప్పు, నూనె, నెలకు సరిపడా ఇంటి సరుకులుతెచ్చుకుంటాం. ఈ నెల పింఛన్ డబ్బులు రాలేదు. చాలా ఇబ్బందిగా ఉంది. ఇంట్లో సరుకులు ఖాళీ అయ్యాయి. మాలాంటి వృద్ధులపై చంద్రబాబుకు ఎందుకు ఇంత కక్ష అర్థంకావడంలేదు. వలంటీర్లు పింఛన్ ఇవ్వకపోతే మేము ఎక్కడికెళ్లి పింఛన్ తీసుకోవాలి. ఎండలు వేరే మండుతున్నాయి. ఇలాంటప్పుడు సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే ఇబ్బందే. వృద్ధులపై ప్రతాపం చూపుతున్న చంద్రబాబుకు కచ్చితంగా బుద్ధి చెబుతాం.

– ధనయ్య, చిత్తూరు

మా కడుపు కొట్టారు



ప్రతి నెలా క్రమం తప్పకుండా వలంటీరు మా ఇంటికే వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. కానీ తెలుగుదేశం నాయకులు మాకు పెన్షన్ ఇవ్వకుండా వలంటీర్లను అడ్డుకుని మా కడుపు కొట్టారు. ఈ నెల 1వ తేదీ గడిచినా పెన్షన్ రానివ్వలేదు. నేను మాట్లాడలేను. నాకు వినిపించదు. టైలరింగ్ పనులు చేసుకుంటా. నాకు వచ్చే డబ్బుతో నా కుటుంబాన్ని పోషించుకునే వాడిని. ఇలాంటి సమయంలో 1వ తేదీ పెన్షన్ రాకపోవడంతో రంజాన్ నెల అయినా సరుకులు తెచ్చుకోలేకపోయా. ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ డబ్బుల్లోనే టైలరింగ్‌కు అవసరమైన దారాలు, బటన్లు తెచ్చుకుంటా. ఆడబ్బులు ఇవ్వలేక అంగడి యజమాని వద్ద ఇబ్బందులు పడ్డా. మాకు పెన్షన్ ఇవ్వకుండా అడ్డుకున్న టీడీపీ వాళ్లకి భగవంతుడు మేలు చేయడు. అని రాతపూర్వకంగా ఇస్మాయిల్ తెలియజేశారు. – ఇస్మాయిల్‌ఖాన్, పుంగనూరు

ఎక్కడికీ తిరగలేను



నా భర్త చనిపోయి చాలా ఏళ్లవుతోంది. నాకు ముగ్గురు కొడుకులు ఇద్దరికి పెళ్లి చేశా. చిన్నకొడుకు నేను మాత్రం ఉంటున్నాం. బతుకు దెరువు కోసం వినాయకపురంలోని మా ఇంటి దగ్గర చిన్న చిల్లర కొట్టు పెట్టుకున్నా. ఒకటో తేదీన వచ్చే రూ.3వేలతో చిల్లరకొట్టుకు చిన్న చిన్న సరుకులు తెచ్చుకునేదాన్ని. నాకేమో మోకాళ్ల నొప్పులు తీవ్రంగా ఉన్నాయి. ఎక్కడికీ ఎక్కువగా తిరగలేను. టీడీపీ చేసిన పనికి ఒకటో తేదీన మాకు పింఛన్ రాలేదు. ఐదేళ్లలో ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి అవ్వా ఇదిగో పింఛన్ డబ్బులు అని నా చేతిలో పెట్టేవాడు. వలంటీర్లను పింఛన్ ఇవ్వనివ్వకుండా చేయడం చాలా బాధగా ఉంది. మా కష్టాలను టీడీపీ నాయకులెవ్వరూ చూడడం లేదు.

– వేదవతి, చిత్తూరు నగరం



గత టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్ అందడం లేదంటూ నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వృద్ధులు (ఫైల్)

మళ్లీ టీడీపీ నాటి పరిస్థితి వస్తే తట్టుకోలేం



గతంలో పెన్షన్ అందుకోవడానికి నానా తిప్పలు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్లను ఏర్పాటుచేసి మా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందించే ఏర్పాటుచేసింది. ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్ పెన్షన్ అందించేది. ఆ రోజే నాకు, నా భార్యకు నెలకు సరిపడా మందులు కొనుక్కునేవాళ్లం. నెల రోజుల పాటు ఆ మందులు వాడుకునేవాళ్లం. వలంటీర్లపై టీడీపీ వాళ్లు ఫిర్యాదు చేశారంట. ఈ ఒకటో తేది నాకు పింఛన్ అందలేదు. నేనే వెళ్లి తీసుకోవాలని చెబుతున్నారు. నాకు వయసు మీదపడింది, 80 ఏళ్ల వయసులో నేను ఎలా వెళ్లి పింఛను తీసుకోవాలి. గతంలో పడిన అవస్థలు మళ్లీ పడాలన్నా నాకు ఓపిక లేదు. ఆ పరిస్థితి వస్తే తట్టుకోలేం.

– టి.లోకనాథం, ముడిపల్లె, నగరి మండలం

నా బాధలు ఎవరికి చెప్పకొనేది



మా ఇంటాయన నరసింహులు చాలా ఏళ్లకు ముందే కాలం అయ్యాడు. నాకు ఒకే ఆడబిడ్డ ఆమెకు పెళ్లి చేసినా. ఇంట్లో నేనొక్కద్దాన్నే ఉంటున్నా. నాకు ఆరోగ్యం బాగోలేదు. ఓ ఇంటకి ఇచ్చి పెండ్లి చేశాక ఆ కూతురు ఏం పట్టించుకుంటుంది. పాత పెంకుటిల్లో కరెంటు లేకున్నా, బుడ్డీ దీపంతో జీవనం సాగిస్తా ఉండా. ఏమంటే దానికి కరెంట్ బిల్లు కట్లేదని కట్ చేసుండారు. ఈ పింఛన్ వస్తే కడదాములే అనుకున్నా. ఉండే నాకొక్కదానికి నెల పింఛన్ వస్తే మెడికల్ షాపుకెళ్లి నెలకయ్యే మందులు తెచ్చుకుంటా ఉంటి. ఇంటి ఖర్చుకు పింఛనే దిక్కు. ఇన్నాళ్లు వలంటీరు మా ఇంటికొచ్చి పొద్దున్నే పింఛన్ డబ్బులిస్తా ఉండే. ఈసారీ వలంటీరు రాలేదు. ఎవరిని పింఛన్ అడగాలో తెలీలేదు. వేరే వాళ్లని అడిగితే చంద్రబాబు చేసిన పనమ్మా తల్లీ అన్నారు. నాలాంటి దానికి డబ్బు రాకుండా చేసినోళ్లకి దేవుడు మేలు చేస్తాడా చెప్పు. ఇప్పుడు నాకు మాత్రలు కావాల, ఇంట్లో కాసిన్ని సరుకులు కావాల. అంగడోళ్లు సరుకుల కావాలంటే అప్పుఇస్తా ఉండిరి. ఒకటో తారీఖు వచ్చేసింది ముందు బాకీ ఇస్తే గదా వాళ్లు మళ్లీ అప్పు ఇచ్చేది. నాకైతే ఏమీ దిక్కే తెలీలే. ఎంత కష్టమొచ్చింది నాయనా, ఆ పింఛన్‌నే నమ్ముకొని బతికే ఒంటరి దాన్ని నేను. నాలాంటి వాళ్లకి పింఛన్ ఇవ్వకుండా వలంటీర్‌ని తీసేయించిన చంద్రబాబుకు ఎందుకు మాపై కడుపు మంటో తెలీడం లేదు. మేం కడుపులు మాడ్చుకుంటే ఆయప్పకు సంతోషంగా ఉంటుందేమో.

– నక్క చినపాప, గొల్విళ్లకోటూరు, పలమనేరు

శాపంగా మారింది



నా పెద్ద కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీరు తలుపుతట్టి పింఛన్ ఇస్తున్నాడు. అలాంటి వారి మీద చంద్రబాబు విషం కక్కారు. మాకు పింఛన్ అందకుండా చేశారు. టీడీపీ వాళ్లకి పుట్టగతులు ఉండవు. అనారోగ్యంతో బాధపడుతున్న నాకు ప్రభుత్వం ప్రతి నెలా వలంటీరు ద్వారా ఇంటి వద్దే రూ.3 వేలు పింఛన్ అందిస్తూ వచ్చింది. ఇందులో కొంత డబ్బులు మందులకు, మరికొంత ఇంటి ఖర్చులకు వాడుకుంటూ ధైర్యంగా గడిపాను. ఇప్పుడు మూడో తేదీ నుంచి మళ్లీ సచివాలయం వద్ద పింఛన్లు ఇస్తారంట. నాకు ఇప్పటికే 92 ఏళ్లు. నడవ లేక మంచానికే పరిమితమై ఉన్నాను. నేను ఎప్పుడు సచివాలయానికి వెళ్లేది, పింఛన్ తీసుకునేది. ఇక మందులు ఎలా కొనుక్కునేది. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు విశేష సేవలు అందించిన వలంటీర్లపై కక్షగట్టడం న్యాయం కాదు. ఇది నాలాంటి పండుటాకులకు శాపంగా మారింది.

–పఠాన్ అమరన్, కార్వేటినగరం

ఇదేమి దౌర్భాగ్యం?



మా కొడుకు సంతోష్‌కి పుట్టుకతోనే అంగవైకల్యం. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికొచ్చి పింఛను ఇచ్చేవాడు. వలంటీర్లు ఎలక్షన్ అయ్యేవరకూ పింఛన్లు ఇచ్చేదానికి వీలు లేకుండా టీడీపీ వాళ్లు చేయడం మంచిది కాదు. మూడో తేదీ సచివాలయానికి వచ్చి పింఛను తీస్కోవాలని అధికారులు చెప్పినారని వలంటీరు చెప్పి వెళ్లాడు. మా బిడ్డ సంతోష్ నిలబడలేడు.. ఆటోలో కూర్చోలేడు..వాడిని సచివాలయానికి ఎట్లా తీసుకుపోయేది? పింఛన్ ఇస్తున్న వలంటీర్లపై ఫిర్యాదు చేశారంటే ఇదేమి దౌర్భాగ్యం. టీడీపీ రాకముందే ఇలా ఉన్నారే, వస్తే ఇంక ఎంత నరకం చూపిస్తారో భయంగా ఉంది. మా అబ్బాయిని సచివాలయం వరకు తీసుకెళ్లడం కష్టం . టీడీపీ వాళ్లు మాకు పింఛన్ రాకుండా చేసేందుకు కారకులైయ్యారు. టైలర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రూ.3 వేల పింఛన్ మాకు ఎంతో ఆదరువుగా ఉండేది. ఇప్పుడు అదీ రాకుండా అడ్డుకున్నారు. మాలాంటి వాళ్ల కడుపు మంట టీడీపీ వాళ్లకి తప్పకుండా తగులుతుంది.

– వసంత, కుప్పం

ముసలోళ్లపై చంద్రబాబు ప్రతాపమా?



ముసలోళ్లపైనా చంద్రబాబు ప్రతాపం చూపించేంది. ఆయన పాలనలో పంచాయతీ ఆఫీసుల దగ్గర తిండి లేకుండా పడిగాపులు కాస్తే పంచాయతీ కార్యదర్శులు తీరిగ్గా వచ్చి పింఛను డబ్బులు ఇచ్చేవారు. నా బిడ్డలాంటి జగన్ బాబు సీఎం అయిన తర్వాత పింఛను డబ్బులను వలంటీరే వచ్చి పొద్దుపుట్టకు ముందే ఇంటికి వచ్చి ఇస్తున్నారు. వలంటీర్లను పింఛను డబ్బులు ఇవ్వకుండా చంద్రబాబు పాడు ఆలోచనతో వారి మనుషుల ద్వారా అడ్డుకొని నీచమైన పనులు చేస్తున్నారు. చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ముసలోళ్లమంతా తగిన గుణపాఠం చెబుతాం. ఓటుతో ఇంటికి సాగనంపుతాం.

– చినపాపమ్మ, దిగువమోదలపల్లె, తవణపల్లె మండలం

మేమంతా సిద్ధం

- నేడు చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించనున్న బస్సు యాత్ర
- నదుం మండలం, అమ్మగారి పల్లెలో బస చేయనున్న సీఎం
- మరునటి రోజు ఉదయం నుంచి సాగనున్న బస్సు యాత్ర
- 3న పూతలపట్టు, 4న నాయుడుపేటలో సభలు
- మూడు రోజుల పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పర్యటన
- ఏర్పాట్లలో నిమగ్నమైన నేతలు



సదుం: సీఎం బస కోసం చేస్తున్న ఏర్పాట్లు



సాక్షి, తిరుపతి: ప్రజాసంకల్ప పాదయాత్ర తరహాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు చిత్తూరు, తిరుపతి జిల్లా వాసులు 'మేమంతా సిద్ధం' అంటున్నారు. సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టేందుకు ఊరూవాడా సిద్ధమయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల సమరభేరి మోగించి ప్రచారానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన ఈ బస్సు యాత్ర వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ముగించుకుని మంగళవారం చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించనుంది. నేటి నుంచి మూడు రోజుల పాటు బస్సు యాత్ర పుంగనూరు, పూతలపట్టు, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల మీదుగా సాగనుంది. మొదటి రోజు సాయంత్రం బోయకొండ క్రాస్ నుంచి ప్రారంభం కానున్న ఈ బస్సు యాత్ర చౌడేపల్లి, సోమల మండలాల మీదుగా.. సదుం మండలం అమ్మగారిపల్లె వరకు సాగుతుంది. తర్వాత ముఖ్యమంత్రి రాత్రికి అక్కడే బస చేయనున్నారు. మరుసటి రోజు (బుధవారం) సదుం మండలం నుంచి బస్సు యాత్ర ప్రారంభించనున్నారు. అదే రోజు రాత్రి తిరుపతి జిల్లాలో ముగియనుంది. గురువారం ఉదయం తిరుపతి జిల్లాలో బస్సు యాత్ర ప్రారంభమవుతుంది.

సమరోత్సాహం

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం నెలకొంది. చంద్రబాబు సొంత జిల్లానే అయినా.. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ రాజశేఖరరెడ్డికి కంచుకోటగా మారింది. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉమ్మడి చిత్తూరు జిల్లా 2019 ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టింది. 14 అసెంబ్లీ సీట్లలో 13 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. మూడు పార్లమెంటు స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుని సైకిల్‌ను పత్తా లేకుండా తరిమేసింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కొనసాగనుంది. కుప్పంలో కూడా ఈ సారి సైకిల్ గాలి తీసేయడానికి ఓటర్లు 'మేమంతా సిద్ధం' అంటున్నారు. ఈ మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ముఖ్యమంత్రి బసకు సన్నాహాలు

సదుం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం రాత్రి మండలంలోని అమ్మగారిపల్లె సమీపంలో బస చేయనున్నట్టు సమాచారం. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో అప్రమత్తం



రవిరాజు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్: ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవిరాజు హెచ్చరించారు. సోమవారం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతోందన్నారు. చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఎండలోకి పంపకూడదని తెలిపారు. పెద్దవాళ్లు సైతం తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులు వందశాతం ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్, సిబ్బందిని తీసుకెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రవాణా నోడల్ అధికారికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఫించన్ల పంపిణీకి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ,వార్డు సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పింఛన్ల కోసం నగదును బ్యాంకుల నుంచి తీసుకురావడం, పంపిణీ చేసే ప్రక్రియను తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో తాగునీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్‌ఓ అనుమతితో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని కోరారు. రేషన్ పంపిణీలో సైతం వలంటీర్లు పాల్గొనకూడదని స్పష్టం చేశారు. సమీక్షలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.

పడగ విప్పిన బెట్టింగ్ భూతం!

ఐపీఎల్ సీజన్ మొదలైంది. పల్లెలు.. పట్టణాలు అనే తేడా లేకుండా బెట్టింగ్ బంగార్రాజులు తయారయ్యారు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో యువత సైతం ఈ రొచ్చులో దిగుతున్నారు. అప్పులు చేసి మరీ పందేలు కట్టి సర్వం కోల్పోతున్నారు. నష్టాల ఊబిలో చిక్కుకుని చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో బెట్టింగ్ భూతానికి చెక్ పెట్టడం పోలీసులకు సైతం సవాల్‌గా మారింది. సెల్‌ఫోన్ల ద్వారా సాగుతున్న వ్యవహారాలను గుర్తించడం వీలుకాని పరిస్థితి తలెత్తింది. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా సాగుతున్న పందేలను అడ్డుకోవడం కష్టతరంగా మారింది.



- జోరుగా ఐపీఎల్ మ్యాచ్‌లపై పందేలు
- సెల్‌ఫోన్ల ద్వారానే మొత్తం వ్యవహారాలు
- యాప్‌ల ద్వారా నగదు లావాదేవీలు
- బెట్టింగ్‌లకు బానిసలుగా మారిన యువత
- దురాశకు పోయి ప్రాణాల మీదుకు తెచ్చుకుంటున్న పందెంరాయుళ్లు

పలమనేరు : ఓవైపు ఎన్నికల సందడిలో నాయకులు, కార్యకర్తలు బిజీగా ఉంటే, బెట్టింగ్‌రాయుళ్లు మాత్రం ఐపీఎల్ పందేలలో మునిగితేలుతున్నారు. ఐపీఎల్ సీజన్ ముగిసేసరికి లక్షాధికారులు కావాలనే ఆశతో కష్టపడకుండా సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో యువకులు, విద్యార్థులు సైతం ఈ రొంపిలోకి దిగుతున్నారు. తీరా నష్టపోయి అప్పులపాలై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఐపీఎల్-24 సీజన్ మొదలు కావడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో క్రికెట్ బెట్టింగులు జోరందుకున్నాయి. పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా రూ.లక్షల్లో బెట్టింగులు జరుగుతున్నాయి. కేవలం సెల్‌ఫోన్ల ద్వారా జరిగే ఈ పందేలను పట్టుకోవడం లేదా బెట్టింగు రాయుళ్లను గుర్తించడం పోలీసులకు సైతం వీలు కాని పరిస్థితి.

మూడు విధాలుగా పందేలు

ప్రస్తుతం సాగుతున్న బెట్టింగులు మూడు రకాలుగా ఉన్నాయి. కొంతమంది కలసి ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా బెట్టింగులు చేస్తున్నారు. ఇంకొందరు రహస్యప్రదేశాల్లో ఉంటూ మ్యాచ్‌లు మొదలైనప్పటినుంచి గ్రూపుల్లోని వ్యక్తులతో చాటింగ్ చేస్తూ బెట్టింగులు వేస్తున్నారు. ఎక్కువ మంది మాత్రం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను వాడుతున్నారు. ప్రస్తుతం ఎలెవన్ బెట్, డ్రీమ్-11, ట్వంటీఫోర్‌క్లబ్, బీక్రిక్, మోస్ట్ బెట్, ఐవిన్, మెల్‌బెట్, బెట్ 365, పారీమ్యాచ్, ఫెయిర్‌ప్లే లాంటి యాప్స్‌ను ఎక్కువ మంది వినియోగిస్తున్నారు.

టాస్ నుంచి మ్యాచ్ విన్నింగ్ వరకు..

ఐపీఎల్ మాచ్‌లు మే 26వ తేదీ వరకు జరుగనున్నాయి. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 3.30 రెండో మ్యాచ్ రాత్రి 7.30లకు మిగిలిన రోజుల్లో రాత్రి 7.30 నుంచి మ్యాచ్‌లు మొదలవుతాయి. మ్యాచ్‌కు ముందుగానే టాస్ వేస్తారు. టాస్ ఎవరు గెలుస్తారనే దాంతో బెట్టింగులు మొదలవుతాయి. ఆపై బాల్ బై బాల్, ఓవర్ టు ఓవర్, ఎక్కువ వికెట్లు, ఎక్కువ పరుగులు, సిక్స్‌లు, ఫోర్‌లతో పాటు మ్యాచ్ గెలుపు వరకు పందేలు సాగుతూనే ఉంటాయి. మ్యాచ్‌కు ముందుగా అయితే 1కి 2, ఓడిపోతే టీమ్‌పై అయిరే 1కి 5 రెట్లు ఎక్కువగా కూడా బెట్టింగులుంటాయి.

కర్ణాటక ముఠాలే కీలకం...

కర్ణాటకలోని ముళబాగిలు, శ్రీనివాసపురం, కేజీఎఫ్, బెంగళూరుకు చెందిన క్రికెట్ బుకీలకు చెందిన ముఠాలు జిల్లాలో బెట్టింగులు జోరుగా చేయిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే పోలీసులు నిఘా ఉంచినా కీలక వ్యక్తుల జాడ తెలియడం లేదని సమాచారం. ఏదేమైనా ఐపీఎల్‌లో కోట్లలో బెట్టింగులు సాగడం గ్యారెంటీ అని తెలుస్తోంది.

> **ప్రత్యేక నిఘా పెట్టాం**
>
> 
>
> ఐపీఎల్ మొదలైయ్యాక సబ్ డివిజన్ పరిధిలో క్రికెట్ బెట్టింగులు రహస్యంగా సాగుతున్న విషయం మా దృష్టిలో ఉంది. దీనిపై ఇప్పటికే ప్రత్యేక నిఘా పెట్టాం. స్మార్ట్‌ఫోన్లలో సాగే బెట్టింగ్ వ్యవహారాలను కనుక్కోవడం కొంచెం కష్టమే. అయితే బాధితుల ద్వారా కీలక సమాచారాన్ని తెలుసుకొని బెట్టింగ్ ముఠాలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.
>
> **మహేశ్వర్ రెడ్డి, డీఎస్పీ, పలమనేరు**

పందేలకు బలైన వారు..

- పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు క్రికెట్ బెట్టింగుల కారణంగా అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడు.
- పలమనేరు పట్టణానికి చెందిన ఓ యువకుడు బెట్టింగుల కారణంగా తన వ్యాపారాన్ని వదులుకొని బెంగళూరుకు వెళ్లిపోయాడు.
- పెద్దపంజాణి మండలంలో ఓ యువకుడు బెట్టింగ్‌లతో నష్టపోయి సమీపంలోని అడవిలోకి వెళ్లి ఉరేసుకుని ఉసురు తీసుకున్నాడు.
- మదనపల్లెకు చెందిన ఓ బీటెక్ విద్యార్థి పలమనేరులోని పాతపేటలో రూమ్‌లో ఉంటూ ఆన్‌లైన్ బెట్టింగుల కారణంగా అప్పులపాలై బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత మూడేళ్లలో పదుల సంఖ్యలో జరిగాయి. అయితే వెలుగుచూడనివి వందల్లోనే ఉన్నట్టు తెలుస్తోంది.

సంక్షేమం.. అభివృద్ధిని ఆశీర్వదించండి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం : సంక్షేమం.. అభివృద్ధి పథకాలను అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. సోమవారం ఎస్‌ఆర్‌పురం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో దళితులకు పెద్ద పీట వేశారన్నారు. విజయవాడ నడిబొడ్డున 210 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దళితవాడల్లో డబ్బులిచ్చి తమను తిట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అభ్యర్థి థామస్ ఎప్పుడూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మణి, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ సరిత, సర్పంచులు హరిత, దిలీప్‌రెడ్డి, ఐశ్వర్య, ఎంపీటీసీ సభ్యులు శివయ్య, మునిరాజులునాయుడు, సిద్ధయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, నాయకులు జనార్ధన్, కుప్పయ్య, రాజా, రవి, శేఖర్, రఘు, కరుణాకర్, చిన్నబ్బ, అమృతరాజ్, చిట్టిమహేష్, చిన్నబ్బ, గోపాలయ్య,బాల, గోపి, శ్రీధర్, నాగరాణి, బాబు, హరిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుది పెత్తందారీ మనస్తత్వం

చంద్రబాబుది పెత్తందారీ మనస్తత్వమని, అందుకే అవ్వాతాతలకు పింఛన్ అందకుండా ఏడిపిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. మండలంలోని ఉద్దండ మహారాజపురంలో ఆయన పింఛన్ లబ్ధిదారు శిలోమి మేరీతో మాట్లాడారు. ఈ సందర్భంగా తమ నోటికాడ కూడను చంద్రబాబు నేలపాలు చేస్తున్నారని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు.మేము ఏం పాపం చేశాం. మా కడుపు కొడుతున్నారని వాపోయారు. దీనిపై డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదలు బాగా బతికితే చంద్రబాబు భరించలేరని, అందుకే వలంటీర్లను పక్కన పెట్టించేశారని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

వలంటీర్లపై వ్యాఖ్యలు దారుణం


మాట్లాడుతున్న మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసిన వలంటీర్లను టెర్రరిస్టులంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని చిత్తూరు నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి మండిపడ్డారు. సోమవారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. అవ్వాతాతలు, దివ్యాంగులకు వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీన వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించారని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలు నేరుగా గుమ్మం ముందుకే చేర్చే వలంటీర్లపై టీడీపీ కక్ష కట్టిందని ఆరోపించారు. వలంటీర్ల వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందని, ఎలాగైనా అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే చంద్రబాబు కుట్ర పన్నారని విమర్శించారు. టీడీపీ నాయకులే ఈసీకి ఫిర్యాదు చేసి వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి నుంచి వలంటీర్లను చులకనగా చూడడం, వారిని జైలుకు పంపిస్తామని చంద్రబాబు బహిరంగంగానే ప్రకటించారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ ఫలాలను వారికి అందిస్తూ వలంటీర్లు లబ్ధిదారుల ఇంట్లో సభ్యులుగా మారారని తెలిపారు. చంద్రబాబు హయాంలో పెన్షన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఎండలో నిలబడి అవస్థలు పడిన పరిస్థితే మళ్లీ ఇప్పుడు వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు కుయుక్తులకు దిగుతున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు పెత్తనం చేస్తాయని హెచ్చరించారు. టీడీపీ వేధింపులకు నగరంలోని వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే, దీన్ని కూడా రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని, ఎమ్మెల్యేగా విజయానందరెడ్డి ఎంపీగా రెడ్డెప్ప ఘన విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : పట్టణంలోని నీళ్లకుంటకు చెందిన 17 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం ఈ మేరకు ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గోవిందురాజులు, సుబ్బ, వెంకటేస్, కుమార్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి టీడీపీలో ఉన్నా తగిన గుర్తింపులేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో తమకు అన్ని పథకాలు అందాయని వెల్లడించారు. సంక్షేమ పాలనకు తమ వంతు మద్దతు పలికేందుకే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేష్, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పార్టీ పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా పాల్గొన్నారు.

పెన్షనర్ల పొట్టకొట్టడం సిగ్గుచేటు


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

కుప్పం : ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ అందుకుంటున్న వృద్ధుల పొట్టకొట్టడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగుల ఇంటికే వస్తున్న పింఛన్‌ను టీడీపీ నేతలు అడ్డుకోవడం దారుణమన్నారు. గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద గంటల తరబడి పడిగాపులు పడేవారని, ఇప్పుడు జగనన్న ప్రభుత్వం ఇంటికే పెన్షన్ పంపుతోందని వెల్లడించారు. ఎన్నికల పేరుతో వలంటీర్లపై ఫిర్యాదు చేసి, చివరకు పెన్షనర్లకు నగదు అందకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీని పింఛనర్లు బ్లాక్ డేగా భావిస్తున్నారని తెలిపారు. అధికారం కోసం చంద్రబాబు ఎంతటి దారుణాలకైనా తెగబడతారని, కుట్రలు కుతంత్రాలు పన్నుతారని చెప్పారు. స్వార్థ రాజకీయాల కోసం ఎవరినైనా బలిపెడతారని వివరించారు. అవ్వాతాతలకు పెన్షన్ రాకపోవడం కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నా రని మండిపడ్డారు. తమ పార్టీ సర్పంచ్‌లపై రీల్స్ చేయడం మంచి పద్ధతికాదన్నారు. ఈ నెల 3 తేదీన జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్ర నిర్వహించనున్నారని తెలిపారు. యాత్రకు కుప్పం నుంచి 200 బస్సులు 100 కార్లతో వెళ్లనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ మురుగేష్ ,స్థానిక నాయకులు మురుగేష్ , రమేష్, నాను పాల్గొన్నారు.

రంగస్థల నటుడు సుందర కేశవులు కన్నుమూత


సుందర కేశవులు (ఫైల్)

చిత్తూరు రూరల్: ప్రముఖ కార్టూనిస్ట్, రంగస్థల నటుడు వి.సుందరకేశవులు (83)సోమవారం చిత్తూరులో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు చిట్టిబాబు కుప్పంతోపాటు వివిధ మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సుందర కేశవులు 1963 నుంచి 1993 వరకు చిత్తూరు మున్సిపాలిటీలో లైబ్రేరియన్‌గా, రికార్డు అసిస్టెంట్‌గా పనిచేశారు. ఆయన అప్పట్లో వేసిన 400 పైగా కార్టూన్లు ప్రముఖ వార్తా పత్రికల్లో ప్రచురితమయ్యాయి.

500కి పైగా నాటకాలు : రంగస్థల నటుడుగా 500కి పైగా నాటకాలు వేసి పేరు ప్రఖ్యాతులు గడించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఎన్నో అవార్డులు, సన్మానాలు పొందారు. 1987లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలు హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ పోటీల్లో సుందరకేశవులు నటించిన దేవాలయంపై బూతు బొమ్మలు నాటిక రాష్ట్రస్థాయి ఉత్తమ నాటికగా ఎంపికైంది. అందులో నటించిన సుందరకేశవులు ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేతులమీదుగా సుందరకేశవులు నంది అవార్డు స్వీకరించారు. ఆర్ట్ లవర్స్ అసోసియేషన్ సభ్యుడిగా సొంతంగా కళానికేతన్ నాటక సంస్థ ఏర్పాటు చేసి నాటక ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం చిత్తూరులో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న క్రిష్టాసా (25) అనే వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. ఎస్‌ఐ షేక్‌షావలీ తన సిబ్బందితో దొడ్డిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా జార్ఖండ్‌కు చెందిన క్రిష్టాసా పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు సమీపంలో మార్చి 29వ తేదీన జరిగిన గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఈ మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లె పంచాయతీ గోపాలపురం ఎస్టీ కాలనీలో చంద్రయ్య, రాణి దంపతులు నివసించేవారు. రాణి తన భర్తతో గొడవపడి తిరుమలకు వెళ్లిపోయి అక్కడే ఓ హోటల్‌లో పనికి కుదిరింది. అదే హోటల్ పనిచేస్తున్న కర్నూలు జిల్లా ఇందిరమ్మకాలనీకి చెందని జయానంద్‌పాల్‌తో ఆమెకు పరిచయమైంది. క్రమేణా పరిచయం పెరిగి సహజీవనానికి దారితీసింది. ఈ విషయం గమనించిన చంద్రయ్య లోలోపలే రగలిపోయాడు. జయానంద్‌పాల్‌ను అంతమొందిస్తే తప్ప తన భార్య దక్కదని భావించాడు. దీంతో పథకం ప్రకారం జయానంద్‌పాల్‌ను కల్లూరుకు తీసుకువచ్చాడు. ఇద్దరూ పూటుగా మద్యం తాగారు. మత్తులో ఉన్నప్పుడు జయానంద్‌పాల్‌పై బండరాయితో దాడి చేశాడు. తలపై రాయితో కొట్టి చంపేశాడు. రెండు రోజుల తర్వాత స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. ఇంతలో చంద్రయ్య జరిగిన ఘటనను కల్లూరు వీఆర్‌ఓ రాజశేఖరనాయక్‌కు తెలియజేశాడు. ఆయన వెంటనే నిందితుడిని తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించాడు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

వెటర్నరీ అసిస్టెంట్ ఆత్మహత్య

శ్రీరంగరాజపురం : ఎస్‌ఆర్‌పురం సచివాలంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రేమ్‌కుమార్(27) సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ రాజకుళాయప్ప తెలిపారు. వివరాలు.. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం అన్నుపల్లి సమీపంలోని ఉప్పిలి వంక గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్(27) ఎస్‌ఆర్‌పురంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఓ యువతిని ప్రేమించాడు. ఆమె దక్కలేదని మనస్తాపంతో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.